# "ఆఖరిదశ"

"జాస్మిన్"

కాశీ నగరంలో గంగానదితీరాన తెల్లటి ఇసిక తిన్నె మీద కూర్చుని, సూర్యకిరణాల్తో తళ తళలాడే అలలవైపు చూస్తున్న దేవదత్తుణ్ణి, వెనకనుంచి వచ్చి భుజంమీద గట్టిగా తట్టి పక్కన చతికిలపడ్డాడు చారుదత్తుడు.

ఇద్దరూ సమవయస్కులు. నడికాలం దాటి జుత్తు బాగా నెరిసింది. ముఖవర్చస్సు చూస్తే గౌరవకుటుంబాలకి చెందినవాళ్లలాగ ఉన్నారు.

"ఏం చారుదత్తా! ఇంత ఆలస్యంగా వచ్చావేం? ఆందోళనగా కూడా ఉన్నట్టున్నావు?"

"ఇంకా వార్త వినలేదా ఏమిటి, నువ్వు?" అని ఆశ్చర్యంతో అడిగేడు చారుదత్తుడు.

"ఏ వార్త? నేనేం వినలేదు. వేగిరం ఏమిటో చెప్పు"

"దుర్యోధనమహారాజు హతుడయిపోయాట్ట"

"హర హరా! ఎప్పుడు?"

"కొద్దిదినాలే అయింది. వార్త ఇప్పుడే తెలిసింది"

"అసలెలా ప్రాణం విడిచేడు?"

"ఆ భీముడే ప్రాణం పుచ్చుకున్నాట్ట".

"అయితే యుద్ధం ముగిసినట్టేనా?"

"ఆ! అధర్మంలో యుద్ధం సమాప్తం అయింది"

"అధర్మంలో సమాప్తమవడ మేమిటి?"

"గదాయుద్ధంలో సుయోధనుణ్ణి జయించలేక చివరకి తొడల మీద కొట్టి చంపేడుట భీమసేనుడు. అలా కొట్టమని పక్కనుండి కృష్ణుడు ప్రోత్సహించేడుట"

"హర హరా, ఈ కృష్ణుడు చేయించే పాపాలకి హద్దున్నట్టు లేదు."

"అతను భగవదవతారం, అందుచేత అతనేం చేసినా తప్పులేదని పాండవుల ప్రచారం."

"ఏమయితే నేం. తనవాళ్లకి రాజ్యం సంపాదించి పెట్టేడు. గొప్ప రాజకీయవేత్త."

"కాదా మరి! అవసరం వస్తే వేదాంతిని నేనని కూడా చెప్పుకుంటాడు"

"అదికూడా ఉందీ?"

"కాక! పాపం, ఆ పాండవమధ్యముడు తొలిరోజున 'నాకీ రాజ్యం వద్దు, రాష్ట్రం వద్దు. నా ఆత్మబంధువుల్ని చేతులారా చంపలేను' అని కూర్చున్నాట్ట. అప్పుడే నల్లవాడు మెట్టవేదాంతం అంతా అతనికి బోధపర్చి పురెక్కించేట్ట."

"ఆహా! నాకీ విషయం ఇంతవరకూ తెలియలేదుస్మా. అయినా ఆ కిరీటికి విరక్తి పుట్టివుండొచ్చు కాని, ఆ పెద్దవాడికి రాజ్యకాంక్ష లేదనుకుంటున్నావా ఏమిటి?"

"లేకపోవడ మేమిటి? ఆ కాంక్షే ఇంతా తెచ్చిపెట్టింది."

"చూసేవా! ప్రాపంచికసుఖాలకోసం గొప్ప గొప్పవాళ్లు, పండితులు, జ్ఞానులు, తండ్రులు, కొడుకులు, అన్నదమ్ములు, బంధువులు, స్నేహితులు, గురువులు, శిష్యులు—అంతా ఒకరొకరిలా చంపుకు

న్నారో! వీరితోపాటు అమాయకప్రజానీకం ఎంత హతమయిందో?"

"దేవదత్తా, ఎటు చూచినా అధర్మం ప్రబలిపోతోంది సుమా. మన ఆర్యుల్లోనే ఈ అధర్మం పొడచూపినప్పుడింక అనార్యుల సంగతి చెప్పవలసినదేముంది" అన్నాడు చారుదత్తుడు విచారంతో.

"ధర్మపద్ధతికి ఆఖరికాలం వచ్చింది" అన్నాడు దేవదత్తుడు.

"ధర్మాధర్మాల మాటేమిటి? నీకూ, నాకూ, అన్నింటికి, ఆర్యావర్తానికే—కాదు, మహాప్రపంచానికే, అంత్యకాలం ఆసన్నమయినట్టుంది."

ఇంతవరకూ సూర్యకిరణాలు పడి మెరుస్తున్న గంగాజలం నల్లగా మారింది. క్రుంగిపోయిన సూర్యుడి కోపం ముఖం ఎర్రజేసుకుంది పశ్చిమదిశ.

"హరహర మహాదేవ శంభో" అన్న రవం ప్రతివైపునుండి వినిపిస్తూంది. చారుదత్త దేవదత్తులు లేచి విశ్వేశ్వరాలయంవైపు మళ్ళేరు.

* * *

సాయంసమయం. సంఘారామంలో తటానికి దిగే చలువరాతిమెట్లమీద నిల్చున్నారిద్దరు బౌద్ధసన్యాసులు. ఇద్దరూ వృద్ధులు. స్నానం చేసి తుడుచుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

"అంతేకా దానందా, ఈ శంకరాచార్యుడు శివుడి అవతారమట. అందరూ చెప్పుకుంటున్నారు" అన్నాడు ఉపాలి.

"ఈ బ్రాహ్మణులు మన తథాగతుణ్ణే విష్ణ్వంశసంభూతుడన్నారు. ఈ శంకరుణ్ణి శంకరుడే అంటున్నారు. ఆశ్చర్యం ఏముంది?" అన్నా డానందుడు.

"అసలెక్కణ్ణుంచి వచ్చాడో ఈ శంకరుడు?"

"మళయాళ దేశం నుంచి. అతనిపూర్వీకులాంధ్ర దేశాన్నుంచి అక్కడికి వలసపోయి నూరు నూటయాభై సంవత్సరా లవుతుందేమో. వెళ్లినవాళ్లంతా బ్రాహ్మణులే"

"అయితే ఇంతకాలం తథాగతుడికి తలలొగ్గిన బ్రాహ్మణులు, తిరిగి తంత్రాలతో తల లెత్తుతున్నారన్న మాట."

"ఎత్తుతున్నారేమిటి? ఎత్తి పడగవిప్పి ఆడుతున్నారు. వాళ్ల నాయకుడే ఈ శంకరాచారి" అన్నా డానందుడు.

ఉపాలి కొంతసేపు మౌనంగా నిల్చొని అడిగేడు.

"దాక్షిణేయులే కాకుండా చాలామంది ఆంధ్రులు కూడా తిరిగి బ్రాహ్మణమతం స్వీకరిస్తున్నారుట?"

"ఆ, ఆ! ఇన్నాళ్లూ వినిపించని వేదఘోష అక్కడక్కడ ఈ మధ్య వినిపిస్తూంది, వినలేదూ"

"ప్చ! ఇదంతా అనర్థానికే వచ్చిందనుకో, ఈ శంకరుడే కాని విజయుడయినట్లయితే, తిరిగి కులభేదాలేర్పడి ప్రజలు చెడిపోతా రానందా"

"కులభేదాల మాట అటుంచు. ఈ శంకరుడో అసంగర్భపు వేదాంతం చెప్తున్నాడు. అది అంతకన్న ప్రమాదకరం. పరమాత్మకీ జీవాత్మకీ భేదం లేదట. నేనే అతడూ, అతడే నేనూ, అనే సూత్రం గ్రహిస్తే అజ్ఞానాంధకారంలోంచి బైటపడతారట. దీని మీద ఇక నెటువంటి ప్రవర్తనలు బయల్దేరుతాయో చూసుకో"

"చూసేదేముంది! ఇటువంటి దుష్ప్రచారాలకి ప్రపంచం లోబడితే అంతా ఆఖరిదశకి వచ్చినట్టే" అని నిట్టూర్పు విడిచేడుపాలి.

* * * *

తాజ్‌మహల్ సమీపాన్న సుందరోద్యానంలో పూల మొక్కల మధ్య పచ్చగడ్డి మీద కూర్చున్నారిద్దరు మహమ్మదీయులు. విలువైన వస్త్రాలు ధరించేరు. టోపీలూ, చేతి కర్రలూ పక్కన పడి ఉన్నాయి.

సాయంకాలపు నీరెండ తాజ్‌మహల్ అంచులకో వింతశోభ తెచ్చిపెట్టింది. చల్లటి గాలి వీస్తోంది.

"భాయీ, ఔరంగజేబ్ పాదుషా చనిపోయాడని పుకారు పుట్టింది. విన్నావా?" అనడిగేడు, హుసేన్‌ఖాన్.

"పుకారు కాదు. నిజమే" అన్నాడు రహిమాన్.

"నిజమేనంటావా?"

'ఆహా, నిజమే.'

"నీ కెవరు చెప్పేరు?"

చెవిలో ఏదో మెల్లగా చెప్పేడు రహిమాన్.

"అల్లా, అల్లా! అయితే వార్త నిజమే అయివుండాలి" అని అరిచేడు హుసేన్‌ఖాన్.

"ఆహా! అయితే అల్లాని ప్రార్థించడం తప్ప మనం చేశేది వేరేమీ లేదనుకో" అన్నాడు రహిమాన్.

"ఇహ రాజ్యానికి కొడుకులు కొట్టుకు చస్తారన్నమాటే."

"అదెలాగా తప్పదు, కొట్టుకుని ఎవడు నెగ్గినా ధాటీగా పరిపాలన చేశే శక్తి లే దెవడికీ."

హుసేన్‌ఖాన్ నిస్పృహతో అన్నాడు. "అయితే కాఫర్లింక మనన్ని బతకనివ్వరు. ఇదివరకే డెక్కన్లో మరాఠీదొంగలు చెలరేగేరు. ఇటు సిక్కులు కత్తులు నూరుతున్నారు. అంతవరకూ ఎందుకు? ఢిల్లీ నగరంలోనే ద్రోహం చెయ్యడానికి కాఫర్లు సాహసిస్తున్నారుట విన్నావా?"

"మన నీరసం చూసి వాళ్లేమైనా చేస్తారు"

"ప్చ! చెడ్డరోజులొచ్చేయి భాయీ!"

"మొగల్ సామ్రాజ్యానికే చెడ్డరోజులొచ్చేయంటే, ప్రపంచశాంతికే భంగం కలిగిందనుకో"

"కాదూ మరి!"

"ఒక్క కాఫర్లే కాదు. పైనుండి పెర్షియన్లు, మంగోలులు, ఇటు కాఫర్లు—అంతా కలిసి తగవులాడి నానా గోల్‌మాలూ జరుగుతుంది"

"మరొకటి. ఈ మధ్య ఓడలమీద దిగుతున్న తెల్లవాళ్లు కొత్త కొత్త ఆయుధాలు తీసుకువచ్చి జాగ్రత్త చేస్తున్నారుట. వాళ్లవైపు చూడ్డంలేదు.

"భాయీ, వీళ్లూ వాళ్లూ అనకు. నానా భీభత్సం జరుగుతుంది. ప్రపంచంలో ఇంక "శాంతి" అనేది ఉండదు. మొగల్ సామ్రాజ్యానికి ఆఖ్రోజులొచ్చేయి."

"మొగల్ సామ్రాజ్యానికే ఆఖ్రోజులొస్తే మహా ప్రపంచానికే అఖరి దశ వచ్చిందన్న మాట." అన్నాడు హుసేన్‌ఖాన్,

* * * *

క్రీస్తు శకం పందొమ్మిది వందల నలభయ్యేడవ సంవత్సరం ఆగస్టు నెల పదిహేనవ తారీకు.

ఆంగ్లేయులిద్దరు క్లబ్బు వరాండాలో వాలు కుర్చీల్లో కూర్చుని చుట్టలు కాలుస్తూ మాట్లాడుకుంటున్నారు. బాగా చీకటి పడింది. చుట్టూ కలకత్తానగరం కన్నుల పండువుగా స్వాతంత్ర్యోత్సవాన్ని జరుపుతూంది. దీపాలతోరణాలు ఎటుచూచినా కనిపిస్తున్నాయి. తారాజువ్వలు ఆకాశాన్నందుకుంటున్నాయి. ప్రతివైపునుంచి జయజయధ్వనులు వినిపిస్తున్నాయి.

'ఛార్లెస్! ఈ నాడింత కోలాహలం చేస్తున్న జనమంతా కొద్దికాలంలో గోరీల్లోనూ, శ్మశానాల్లోనూ ఉంటారు. చూసుకో" అన్నాడు రిఛర్డ్.

"బాగా చెప్పేవు" అన్నాడు చార్లెస్.

"పంజాబ్‌లో అప్పుడే అల్లర్లు బయల్దేరేయి తెలుసా."

"ఒక్క పంజాబ్‌లోనే కాదు, దేశమంతటా బయల్దేరేయి"

"ఇటువంటివాళ్లు స్వపరిపాలన సాగిస్తారట."

"ఇదంతా వినాశానికే వచ్చింది"

"అంతటికీ కారణం మనదేశంలో చేతకాని గవర్నమెంటు రావడం"

"అదో కారణం అయినా, దీన్లో FATE పని చేస్తూందనుకో! ప్రపంచమంతా కుక్కల నక్కల పాలవుతూంది. మనబ్రిటిష్‌సామ్రాజ్యం ఇలా నీళ్ల కలిసిపోతోందా! అటు రష్యన్‌పిశాచం దొరికినవాళ్లందర్నీ కబళిస్తోంది. దొరకనివాళ్లకోసం చేతులు చాస్తోంది."

'ఏటమ్‌రహస్యం మనకైనా చెప్పకుండా అమెరికన్లు పట్టుకు కూర్చున్నారిటు"

"వాళ్లూ, వీళ్లూ, మనం, కూడా జర్మనీలో కూర్చుని రాళ్లు రువ్వుకుంటున్నాం"

'మన మధ్య జర్మనీయే కాకుండా యూరప్ అంతా నలిగిపోతోంది"

"ఇటు ఏషియాలో ఇండియన్లతో సహా అంతా కొట్టుకు చస్తున్నారు."

"అంతా ఘోరంగా ఉన్నది."

"చూస్తూ ఉంటే ప్రపంచానికి ఆఖరిదశ సమీపించినట్టుంది"

"బాగా చెప్పేవు."

* * * *

ప్రపంచం సాగుతూనే ఉన్నాది. ఇన్ని వేల సంవత్సరాలనుంచీ.